క్లుప్తంగా

నేడు కర్నూలు మండల మీట్

కర్నూలు(సెంట్రల్): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు కర్నూలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. సభ్యులతో పాటు మండల పరిషత్ ప్రత్యేకాధికారి, ఎంపీ, కోడుమూరు ఎమ్మెల్యే హాజరుకావాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి 28 పేజీల నోట్‌ను తయారు చేసినట్లు పేర్కొన్నారు.

సైన్స్ పరీక్షకు 87 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండల కేంద్రంలోని రెండు సెంటర్లలో బుధవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ ఫిజికల్ సైన్స్ పరీక్షకు 87 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 215 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 174 మంది హాజరయ్యారు. 41 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి అనంతయ్య తెలిపారు. అదే విధంగా మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 211 మంది హాజరుకావాల్సి ఉండగా 46 మంది గైర్హాజరయ్యారని పాఠశాల పరీక్షల చీఫ్ ధనుంజయగౌడ్ వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు కార్బైడ్ 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి గూడూరు ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌కు వచ్చే 132 కేవీ లైన్ సామర్థ్యం పెంపు పనులు చేస్తున్నందున గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.సుబ్బన్న తెలిపారు. నాగలాపురంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కాపురం, పెద్దపాడు 11 కేవీ ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఈ ఫీడర్ల పరిధిలోని నెరవాడ, పర్ల, మార్కాపురం, కొట్టాల తదితర గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు మండలానికి చేరినట్లు ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికిగాను తొలి దశలో 1, 2, 6 తరగతులకు సంబంధించిన తెలుగు, గణితం, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులకు కలిపి 9550 పాఠ్యపుస్తకాలు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టు పుస్తకాలను స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో భద్రపరచినట్లు తెలిపారు. మిగతా సబ్జెక్టు పుస్తకాలు రెండవ దశలో రావాల్సి ఉందని పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ

సి.బెళగల్: వలసల నివారణ కోసం అడిగిన వారందరికీ ఉపాధి హామీలు పనులు కల్పిస్తున్నామని.. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఉపాధిహామి ఏపీఓ లక్ష్మన్న అన్నారు. బుధవారం ఆయా గ్రామాల్లో జరుగుతున్న కాలువల పూడికతీత, ఇంకుడు గుంతల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల వద్ద వసతులు, సౌకర్యాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో దినసరి వేతనం రూ.300 వచ్చేలా కొలతలతో పనులు చేసుకోవాలని సూచించారు.

ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సునీతకు వీడ్కోలు



న్యాయమూర్తి సునీతను సన్మానిస్తున్న జడ్జీలు, కోర్టు సిబ్బంది

కర్నూలు (లీగల్): ఈనెల 31వ తేదీ పదవీ విరమణ పొందనున్న ఏసీబీ కోర్టు న్యాయమూర్తి సునీతకు బుధవారం వీడ్కోల సమావేశం ఏర్పాటు చేశారు. న్యాయమూర్తులు గురువారం నుంచి సెలవుల్లో వెళ్తున్నందున బుధవారమే జిల్లా కోర్టు హాలులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ సిబ్బంది ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏఓ నరసింహారావు, జూనియర్ అసిస్టెంట్ సి.నరసింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ సి.దేవదానంను కూడా ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్ సైతం ఈనెల 31వ తేదీ పదవీ విరమణ పొందనున్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు ప్రతిభా దేవి, జి.భూపాల్‌రెడ్డి, పి.పాండురంగారెడ్డి, సబ్ జడ్జి దివాకర్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్నదేవి, జిల్లా కోర్టు ఏఓ పాల్గొన్నారు.

అన్నదాతకు వెన్నుదన్నుగా..

- ఆర్బీకేల్లో రైతులకు సమాచార కేంద్రంగా కియోస్క్
- ఎరువులు, మందులు బుక్ చేసుకునే అవకాశం
- వాతావరణం నుంచి పంటల విక్రయం వరకు సమస్త వివరాలు అందుబాటులో
- తొమ్మిది రకాల సేవలందిస్తున్న యంత్రం
- రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వం



ఎరుకలచెర్వు ఆర్బీకేలో కియోస్క్‌లోనున్న యాప్‌ల వినియోగాన్ని రైతులకు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

కృష్ణగిరి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతను చేయిపట్టుకొని నడిపించి వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. అడుగడుగునా అండగా నిలిచి రైతు ప్రభుత్వంగా పేరుగాంచింది. గ్రామ స్థాయిలోనే రైతన్నకు సేవలన్నీ అందించాలని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. భూసార పరీక్షల నుంచి పంట దిగుబడి విక్రయం వరకు అన్ని రకాల సేవలను వీటిల్లో అందుబాటులో ఉంచింది. గతంలో రైతులు విత్తనాలు, ఎరువులు పొందాలంటే ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నారో గమనించి వాటి నుంచి విముక్తి కల్పించేలా చర్యలు చేపట్టింది. ఏ సీజన్‌కు అవసరమైన ఎరువులు, మందులు గ్రామంలో అందుబాటులో ఉంచి నిర్దేశించిన ధరకు విక్రయించడంతో కర్షకులకు కష్టాలు తప్పాయి. ఇక రైతన్నలు ఎరువులు, మందులు అవసరమైన వాటిని సొంతంగా బుక్ చేసుకునేందుకు కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. వీటిల్లో తొమ్మిది రకాల సేవలందేలా చర్యలు తీసుకుంది. దీని ద్వారా ఏ కాలంలో ఏ పంటలు వేయాలి, కొనుగోలు కేంద్రాలు, పంట నాణ్యతా ప్రమాణాలు, వాతావరణం, మార్కెట్ ధరలు, మార్కెట్ కనీస మద్దతు ధరలు తదితర తొమ్మిది అంశాలను ఆయా యాప్‌ల ద్వారా రైతులు తెలుసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు వివరించారు.

● రైతు సమాచారం..

రైతులకు సంబంధించి వ్యవసాయ వార్తలను కియోస్క్ ద్వారా తెలుసుకోవచ్చు. వైఎస్సార్ రైతు భరోసా, సాగుకు భరోసా, ప్రకృతి వ్యవసాయం సాగుచేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, ఆర్బీకేల పంటల కొనుగోలు వంటి వార్త సంబంధిత విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

● కనీస మద్దతు ధరలు..

ఆర్బీకే పరిధిలో ముఖ్య పంటలకు కనీస మద్దతు ధరలు తెలుసుకునే వీలుంది. వరి, మొక్కజొన్న, వేరుశనగ, వాణిజ్య పంటలు తదితర అంశాల్లో రైతు నష్టపోకుండా అనుకూలమైన ధరలకు అమ్ముకునేందుకు ఈ యాప్‌ను రూపొందించారు.

● ప్రయోగశాలల సమాచారం..

ఆర్బీకే పరిధిలోని రైతులకు డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ఏ భూమిలో ఏ పంట వేయాలి, దానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పశువులకు వచ్చిన రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు తెలుసుకునేందుకు వీలుంది.

● కొనుగోలు కేంద్రాలు..

గతంలో రైతులు పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడో తెలియక దళారులను ఆశ్రయించే వారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ ద్వారా దగ్గరలోని కొనుగోలు కేంద్రాలు.. తదితర విలువైన సమాచారం అందుతోంది. దీంతో రైతులకు చాలా లాభదాయకంగా ఉంటుంది.

● వాతావరణం..

ఈ యంత్రం ద్వారా వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఆర్బీకే పరిధిలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దీనికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

● మార్కెట్ ధరలు..

మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలను తెలుసుకోలేక ఒక్కొక్కరు ఒక్కోలా చెబుతుండటంతో దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికి ఆర్బీకేకు దగ్గర్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పంటల తేమ శాతం ఆధారంగా రైతు విక్రయించుకునే సమయానికి కనిష్ట, గరిష్ట మార్కెట్ ధరలను తెలుసుకొనేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

● ట్యుటోరియల్..

కియోస్క్‌లో పొందుపరిచిన ఆఖరి యాప్‌లో అన్ని రకాల పంటలను సాగుచేసే విధానానికి సంబంధించిన వీడియోలు ప్రదర్శించడం, సమగ్ర సస్యరక్షణ, పంట యాజమాన్యం తదితరాలను వీడియో రూపంలో చూపించి రైతులకు అవగాహన కల్పిస్తుంది.

● అనుబంధిత యాప్..

కియోస్క్‌లో పొందుపర్చిన అనుబంధిత యాప్‌లో మరో ఐదు అంశాలను చేర్చారు. ఆర్బీకే అమ్మకాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం అమలు చేస్తున్న పనిముట్లు, పశుసంవర్ధక, మత్స్య సంపద ఉత్పత్తులు, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల వివరాలు, కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, ఇతర ప్రయోజన సౌకర్యాలు తెలుసుకునే వీలుంది.

> **రైతులకు చాలా ఉపయోగం**
>
> ఆర్బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే యాప్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చు. గ్రామస్థాయిలోనే అన్ని రకాలు సేవలు లభించడం వల్ల రైతులు కూడా ఆనందంగా ఉన్నారు.
>
> – ఎస్. వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి, కృష్ణగిరి



కియోస్క్‌లో పొందుపరిచిన మల్టీ ఫంక్షనల్ యాప్‌లు

యువకుడి ఆత్మహత్య

పాణ్యం: అనారోగ్య సమస్యలతో పోలూరుకు చెందిన చాకలి మోహన్ వంశీ (23) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. వివరాలు.. నంద్యాల మండలం పోలూరు గ్రామానికి చెందిన చాకలి చెన్నయ్య, లక్ష్మీదేవి దంపతులకు కుమారుడు మోహన్ వంశీ, కుమార్తె ఉన్నారు. మోహన్ వంశీ శిరివెళ్లలోని పోస్టాఫీసులో తాత్కాలిక జాబ్ జీడీఎస్ టాకర్‌గా పనిచేస్తున్నాడు. గత కొద్దికాలంగా కడుపునొప్పితో పాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ స్థితిలో జీవితంపై విరక్తితో ఈనెల 27న పాణ్యం మండలం బలపనూరు మెట్ట వద్ద పురుగు మందు తాగి వాంతులు చేసుకున్నాడు. గమనించిన స్థానికులు శాంతిరాం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

కర్నూలు(హస్పిటల్): హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో జీవిస్తున్న 50 మంది పెద్దలు, చిన్నారులకు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి ఎల్. భాస్కర్ చేతుల మీదుగా బుధవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ నెం.40(ఏఆర్‌టీ సెంటర్)లో నేస్తం ఫర్ రాయలసీమ రీజియన్ పీపుల్ లివింగ్ విత్ హెచ్ఐవీ/ఎయిడ్స్ వెల్ఫేర్ సొసైటీ,డిస్ట్రిక్ట్ లెవెల్ నెట్‌వర్క్ కేర్ సపోర్ట్ సెంటర్ ఆధ్వర్యంలో ఇంటర్నేషన్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా దాతలు బేతంచర్లకు చెందిన గౌరి వెంకటరామిరెడ్డి, ఇతరుల సహకారంతో పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఏఆర్‌టీ సెంటర్‌లోని సిబ్బంది చాలా మంచి ఉద్దేశంతో పనిచేస్తున్నారని తెలిపారు. మందులు మధ్యలో మానేసిన వారిని రప్పించేందుకు, వైరల్ లోడ్ ఎక్కువ ఉన్న వారికి, సీడీ4 తక్కువ ఉన్న వారికి పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. మందులు వాడేవారు వారికి కేటాయించిన తేదీల్లో మందులు తీసుకెళ్లాలని చెప్పారు. రోగి క్రమంగా మందులు వాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే వైద్యులకు ఆత్మసంతృప్తి లభిస్తుందని అన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా బాల సంచయ్ కమిటీలు ఉన్నాయని, దుర్భర పరిస్థితుల్లో ఉన్న పిల్లలకు సేవ చేసేందుకు ఈ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు. పునరావాసం, విద్య తదితర సేవలు ఉచితంగా అందిస్తాయని చెప్పారు. దుర్భర పరిస్థితులు అనుభవిస్తు పిల్లల సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కె.రాధిక, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీహైదర్, ఐసీటీసీ కౌన్సిలర్ నాగేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

లూజు విత్తనాలు కొనుగోలు చేయొద్దు



విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: అనుమతి లేని లూజు పత్తి విత్తనాలను కొనుగోలు చేసి ఎట్టి పరిస్థితుల్లో సాగు చేయవద్దని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతులకు సూచించారు. బుధవారం కోడుమూరులోని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేశారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఐదు రకాల కంపెనీలకు చెందిన విత్తనాలను పరీక్షల నిమిత్తం తాడేపల్లిగూడెం ల్యాబ్‌కు పంపించారు. విత్తన దుకాణదారులు రైతులకు నాణ్యమైన కంపెనీ విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణదారుడు వ్యవసాయశాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విత్తన కొనుగోలు సమయంలో రైతులకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. రైతులు కూడా లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనొద్దని, ఎవరైనా అమ్ముతుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అడ్మిషన్లు షురూ



పిన్నాపురంలో బాలుడి తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిలోని సౌకర్యాలను వివరిస్తున్న హెచ్‌ఎం కేశవ

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్ల ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లోని సౌకర్యాలను వివరిస్తున్న ఉపాధ్యాయులు
- అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులపై దృష్టి
- అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయుల కృషి

పాణ్యం: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ర్యాంకులు అంటూ రంగు రంగుల బ్రోచర్లు, టీవీ ప్రకటనలు, ఇతర ప్రచారాలను ఉపయోగించుకుని అడ్మిషన్లను రాబట్టే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో పర్యటించి చిన్నారుల ఇళ్లవద్దకే వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలు, ఇంగ్లిష్ మీడియం బోధన, పౌష్టికాహారం, విద్యాకానుక కిట్లు, షూ, బెల్ట్, నాణ్యమైన పాఠ్య, నోట్ పుస్తకాలు, చక్కటి యూనిఫాం, ఐ.ఎఫ్.పీ ప్యానెల్ ద్వారా విద్యా బోధన, చక్కటి ఆహ్లాదకరమైన వాతవరణంతో పాటు పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సాధించిన ఫలితాలను వివరిస్తూ చిన్నారని బడిలో చేర్పించేలా కృషి చేస్తున్నారు.

అంగన్‌వాడీ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులపై దృష్టి

అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకున్న పిల్లలు, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రంలో రెండవ తరగతి పూర్తి చేసుకున్న పిల్లలను నేరుగా మూడవ తరగతిలో చేర్పించడం, అలాగే గ్రామంలో ప్రయివేట్ పాఠశాలలకు వెళ్లే పేద విద్యార్థుల వివరాలను ఆరా తీసి వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి వారిలో చైతన్యం నింపుతున్నారు. పాఠశాల విద్య బలోపేతానికి ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వివరిస్తూ చిన్నారికి అడ్మిషన్ తీసుకునేలా కృషి చేస్తున్నారు.

జిల్లాకు చేరిన పుస్తకాలు

నంద్యాల జిలాలో మొత్తం 1957 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 1127, ప్రాథమికోన్నత పాఠశాలలు 352, ఉన్నత పాఠశాలలు 478 ఉన్నాయి. ఈ బడుల్లో చదువుకునే విద్యార్థులకు అందించేందుకు మొత్తం 17,16,839 పాఠ్య పుస్తకాలు అవసరం అవుతాయి. అలాగే వర్క్ పుస్తకాలు 2,17,041 కావాలి. ఈ పుస్తకాలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకోగా విద్యా శాఖ అధికారులు ఆయా మండలాలకు చేరవేసే పనిలో పడ్డారు.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను సంఖ్యను పెంచడం, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. ఎక్కడా డ్రాపౌట్స్ లేకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాం. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– సుబ్రమణ్యం, ఎంఈఓ-2, పాణ్యం

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
- భద్రత, సీసీ కెమెరాల ఏర్పాట్లపై ఆరా
- పార్కింగ్, ఇతర సౌకర్యాలపై సమీక్ష



సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు భద్రపరిచిన ఆర్జీఎం, శాంతిరామ్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లను నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల గార్డులు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీసులు, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భద్రతా సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా చూసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజున ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పహారా ఉంటుందని వివరించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల విజయోత్సవ సంబరాలు, బహిరంగ కేక్ కటింగ్‌లు, ర్యాలీలపై నిషేధం ఉందని ఎవరూ నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఏ చిన్న సంఘటన జరిగినా తక్షనమే పోలీసుకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా గ్రామ సభల ద్వారా పోలీసులచే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్బీ డీఎస్పీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ వెంకటేశ్వరరావు, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మధ్యాహ్న భోజన ఏజెన్సీల వారికి వంటల పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



పాణ్యం: మాట్లాడుతున్న ఎంఈఓ-2 సుబ్రమణ్యం



కల్లూరు: ఏజెన్సీ సభ్యులు తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

కల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసే ఏజెన్సీల వారు వంటగది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలని ఎంఈఓ-1 శ్రీనివాసులు, ఎంఈఓ-2 వనజకుమారి సూచించారు. పాఠశాలలో ప్రతి రోజు మెనూ ప్రకారం అందించాల్సిన వంటకాలను వీడియోల రూపంలో ప్రదర్శించారు. అనంతరం కల్లూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి వంటల పోటీలను నిర్వహించారు. సభ్యులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రత్యేక వంటలను తయారు చేశారు. వాటిని ఎంఈఓలు పరిశీలించారు. పోటీల్లో పాల్గొన్న అందరినీ ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి బహుమతి - ఎంపీయూపీ (యూ) శరీన్‌నగర్, రెండవ బహుమతి -ఎంపీపీఎస్ (ఆర్) శరీన్‌నగర్, ఎంపీపీఎస్ పర్ల, మూడవ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శరీన్‌నగర్, కన్సోలేషన్ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడకనపల్లె సాధించినట్లు అధికారులు తెలిపారు.

శుభ్రత, రుచికరమైన ఆహారం అందించాలి

పాణ్యం: వంట ఏజెన్సీ సభ్యులు విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని తయారుచేసి అందించాలని ఎంఈఓలు సుబ్రమణ్యం, కోటయ్య సూచించారు. బుధవారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంటగది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే సోమవారం నుంచి శనివారం వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం తయారుచేసి విద్యార్థులకు అందించాలన్నారు. గ్యాస్‌తో వంట చేసే సమయంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది శిక్షణ ఇచ్చారు. అనంతరం ఏజెన్సీ సభ్యులకు వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం

కర్నూలు (టౌన్): విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడలు అవసరమని సెట్కూర్ సీఈఓ రమణ అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టులో వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన క్రీడాకారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో ఆసక్తి ఉన్న క్రీడల్లో పట్టు సాధించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ.. ఉత్తమ శిక్షణ ద్వారా క్రీడాకారులు మంచి ప్రతిభ చాటాలన్నారు. శిక్షణలో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు.. నందివర్గంకు చెందిన చాకలి బాలస్వామి బుధవారం రాత్రి పాణ్యం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా శ్రీనివాస నర్సరీ వద్ద అదుపుతప్పి కిందపడడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే పాణ్యం చెంచుకాలనీకి చెందిన తోట గణ, భార్య ఓబులమ్మ బైక్‌పై హైవే దాటుతుండగా మరో బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో నంద్యాల జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.